www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024

5

వైఎస్ఆర్



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు రావచ్చనే సూచనతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండొచ్చని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన ఇసుక బ్యాగ్గులు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పూరి గుడిసెలు, పాత మిద్దెలు, మట్టితో కట్టిన ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08562-246344కు సమాచారం అందించాలన్నారు.

తగ్గిన పసుపు సాగు

పెరుగుతున్న పెట్టుబడి
మద్దతు ధరలు లేకపోవడం ప్రధాన కారణం



ప్రజాశక్తి -చాపాడు

దేశంలోని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. దేశీయ వినియోగంతో పాటు కొన్ని వేల టన్నులను విదేశాలకు ప్రతి సంవత్సరం ఎగుమతి చేయడం, మందుల తయారీలో, రంగులలో, సౌందర్య సాధనాలలోఅధికంగా ఉపయోగిస్తారు. భారతీయ సంస్కృతిలో పసుపునకు మంచి స్థానం ఉంది. ప్రతి కార్యక్రమంలో పసుపును తప్పక వాడతారు. పసుపు సాగులో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పసుపు ఉత్పత్తిలో 80 శాతం వరకు మన దేశానిదే. దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వాటా మన ఆంధ్రప్రదేశ్‌ది. మన రాష్ట్రంలో గతంలో సుమారు 16 800 హెక్టార్లలో పసుపు సాగు చేస్తూ 1, 46000 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించేవారు. అది కూడా కడప, గుంటూరు జిల్లాల్లో ముఖ్యంగా పసుపు సాగు చేసేవారు.

గతంలో కడప జిల్లాలో సాగు..

కడప జిల్లాలోని 21 మండలాల్లో 12,500 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. రెండేళ్ల కిందట ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారిగా ఎకరాల్లో పసుపు సాగును పరిశీలిస్తే మైదుకూరులో 1675 ఎకరాలు, దువ్వూరులో 1255, చాపాడులో 707.5, ఖాజీపేటలో 1300, బి. మఠంలో 195, సికె దిన్నెలో 1032.5, పెండమర్రిలో 387.5, మైలవరంలో 437.5, జమ్మలమడుగులో 225, కాశినాయనలో 925, పోరుమామిళ్లలో 587.5 , కలసపాడులో 187.5, ఒంటి మిట్టలో 525, సిద్ధవటంలో 330, నందలూరులో 390, చిట్వేలు 130, పుల్లం పేటలో 220, ఓబులవారిపల్లిలో 47.5, రాజంపేటలో 355, రైల్వేకోడూరులో 212.5, రాజుపాలెంలో 100 ఎకరాల్లో సాగు అయ్యేది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతుంది.



సీతారామపురం వద్ద సాగులో ఉన్న పసుపు పంట

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3200 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు అయినట్లు సమాచారం. ముఖ్యంగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలంలో సాగుకు రైతులు అనాశక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో వ్యాపారులు ప్రారంభంలో రూ.6500 కొనుగోలు చేసి, రైతులు పసుపు దిగుబడిని పూర్తిగా అమ్ముకున్న తరువాత ధరలు అమాంతం పెంచారు. రూ.11వేల వరకు పలికింది. . ఇలాంటి పరిస్థితుల్లో పసుపు పంట సాగు చేసే నష్టాల్లో కూరుకుపోవడంతో ఎందుకని రైతన్నలు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది .

నిలకడగా లేని ధరలు...

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిఎసిపి వారు పసుపు పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. జిల్లాలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో పసుపు పంటకు మార్కెట్ సౌకర్యం ఉంది. మన రాష్ట్రంలో మన జిల్లాతో పాటు దుగ్గిరాల మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుపుతారు. ధరల నిర్ణయం పూర్తిగా వ్యాపారస్తులదే. పసుపు గ్రేడింగ్ అధికారులు మాత్రం నామమాత్రంగా అందుబాటులో ఉంటున్నారు. సరైన గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు నిల్వ సౌకర్యం అందుబాటులో లేదు. గత ఏడాది సాగైన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ. 6750 గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ ఆధ్వర్యంలో పసుపు పంటను కొనుగోలు చేశారు . అయితే ప్రభుత్వం పసుపు సేకరించిన తరువాత మార్కెట్‌లో క్వింటా రూ. 10వేలకు పైగా పలికింది.

ప్రతి ఏడాది తగ్గుతున్న సాగు..

దువ్వూరు మండలంలో పసుపు పంట సాగును గమనిస్తే 2018 -2019లో 2500 ఎకరాలు మండలంలో పసుపు పంట సాగు చేయగా, 2019-2020లో 1800 ఎకరాలు సాగు చేశారు. 2020-2021లో 900 ఎకరాలు, 2021 -22లో 550 ఎకరాలు, 2022-23 లో 290 ఎకరాలలో మాత్రమే పసుపు పంట సాగు చేశారు. ప్రస్తుతం 250 ఎకరాలలోపు మాత్రమే సాగు చేశారు. జిల్లెల్ల, కానగూడూరు, పెద్ద జొన్న వరం, రామసాయినగర్, గుడి పాడు, భీముని పాడు, రామాపురం, వెంకుపల్లి, సి. ఎస్ పల్లి, మది రేపల్లె, సంజీవరెడ్డిపల్లి ప్రతి సంవత్సరం పసుపు పంట తగ్గుతూ వస్తుందని ఉద్యానశాఖ అధికారులు తెలుపు తున్నారు. చాపాడు మండల పరిధిలో కూడా పసుపు సాగు గణనీయంగా తగ్గు ముఖం పట్టింది. గత ఏడాది 195 మంది సాగు చేపట్టగా ఈ ఏడాది వంద మందికి పరిమితం అయింది. పసుపు పంట దిగుబడి తగ్గుతుండటం, గిట్టుబాటు ధర లేకపోవడం, 10నెలల పాటు పంటకు సంరక్షణ చేయాల్సి ఉండటంతో నష్టాలు వసున్నాయని అందువల్లనే వేరే పంటలపై మొగ్గుచూపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పండిన పంటకు మద్దతు ధర ప్రకటించలేదని, ప్రభుత్వం కొనుగోలు పూర్తి చేయటం లేదని , ధరలు నిలకడగా ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒక సంవత్సరం కొనుగోలు చేసి తరువాత తిరిగి ఏడాది కొనుగోలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కేటాయించాల్సిందిగా పసుపు పండించే రైతులు కోరుకుంటున్నారు.

సాగు ఖర్చులు అధికమవుతున్నాయి

పసుపు పంట సాగుకు ఎకరాకు రూ. 80 నుంచి లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ. 10,000 వరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది.ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-రామసుబ్బారెడ్డి, రైతు , సీతారామపురం.

ధరలు లేక సాగు పూర్తిగా తగ్గించాం

గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేపడుతూ ప్రస్తుతం తగ్గించాం .ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. దీంతో పసుపు పంట సాగు కు ఆసక్తి తగ్గింది. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. .గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇతర పంటలపై ఆధార పడుతున్నాం.

- మనోహర్ రెడ్డి , చాపాడు.

అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండండి

- వైసిపి శ్రేణులకు వై.ఎస్.జగన్ భరోసా



పెండ్లిమర్రిలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి-వేంపల్లె/పులివెందుల టౌన్

వైసిపి శ్రేణిలు అందరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం తొలిరోజు బెంగళూరు నుండి కడప ఎయిర్ పోర్ట్‌కు ప్రత్యేక విమానంలో వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెండ్లిమర్రి మండలంలోని మాచునూరు గ్రామానికి వెళ్లి ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన మాచునూరు సర్పంచ్, మండల కన్వీనర్ నైనా మాచునూరు చంద్ర ఇంటికి వెళ్లారు. మాచునూరు చంద్ర చిత్ర పటానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరా మర్శించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని చంద్ర కుటుంబ సభ్యులకు జగన్ చెప్పారు. మాజీ సిఎం జగన్ మాచునూరుకు రావడంతో ప్రజలు, వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జగన్‌తో కరచాలం చేసేందుకు జనాలు ఎగబడ్డారు. ప్రతి నాయకునిడిని కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం మాచునూరు నుండి గొందిపల్లెకు వెళ్లిన జగన్ ఇటీవల వివాహం జరిగిన రామచంద్రారెడ్డి తనయుడునైన కడప మార్కెట్ యార్డు కమిటీ మాజీ ఛైర్మన్ చంద్రహసరెడ్డి కుమార్తె ఆశారెడ్డి, శివారెడ్డి నూతన దంపతులను ఆశీర్వాదించారు. అక్కడికి కూడా జనాలు భారీ సంఖ్యలో రావడంతో ప్రతి ఒక్కరిని పలుకరించారు. జగన్ రాక కోసం మధ్యాహ్నం మూడు గంటల నుండి నంది మండలం, తగేండుపల్లె, కొత్తూరు, వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో జనాలు వేచి చూశారు. ఆలస్యం అయినప్పటికీ జగన్ కోసం వేచి చూశారు. వేంపల్లెకి వచ్చేసరికి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లారు. అక్కడ మహిళాలు హరతులిచ్చారు. వైసిపి నేతలకు, కార్యకర్తలకు అభివాదం చేసి వేముల మీదుగా పులివెందులకు వెళ్లారు. జగన్‌ను ఘన స్వాగతం పలికిన వారిలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ కుంరాకుల వెంకటేష్, ముత్యాల ఆంజనేయులు, కమతం రాజా, ఎంపిటిసి భారతి, మైనార్టీ నేత షెక్షావలి, వైసిపి నేతలు పాల్గొన్నారు. జగన్ రాత్రికి పులివెందులలోని తన ఇంట్లో బస చేశారు.

యుపిఎస్ అమలు ఆలోచన విరమించుకోవాలి : యుటిఎఫ్



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుపిఎస్ అమలు చేసే ఆలోచనలను విడనాడి, పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ శివశంకర్ లోతేటి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ పాత పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేశాయన్నారు. ఈ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యోగ భద్రతను కోల్పోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పాత పెన్షన్ సాధనకు భవిష్యత్తులో పోరాటాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అనా రోగ్య కారణంగా విధులలో పాల్గొనలేకపోయిన నలుగురు ప్రధానోపాధ్యాయులకు శాశ్వతంగా రెండు ఇంక్రిమెంట్లను కోత విధించడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మానవతా దృక్పథంతో ఆ ఉత్త ర్వులను రద్దు చేయాలని కోరగా, యుటిఎఫ్ వినతి పట్ల కలెక్టర్ సాను కూలంగా స్పందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాజులపల్లె గోపీనాథ్, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తేదీకి ఒక రోజు ముందుగానే శనివారం ఉదయం 5.30 గంటలకే స్థానిక నాగరాజుపేట 23వ వార్డులోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను స్వయంగా పంపిణీ చేశారు. **కడప అర్బన్ :** కడప నగరంలోని 38 వ డివిజన్‌లో టిడిపి నాయకులు అమీర్‌బాబు పింఛను పంపిణీ చేశారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుడతారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, 38 వ డివిజన్ ఇన్‌ఛార్జి ఆదిల్, డాక్టర్ వర కుమార్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ పేర్కొన్నారు. శనివారం 23, 26, 27 డివిజన్లలో ఆల్మస్‌పేట జంక్షన్, మార్కెట్ యార్డ్ జంక్షన్, గౌస్ నగర్ పరిసర ప్రాంతాల్లో కాలువలు, రోడ్లు పరిశీలించారు. ఆల్మసపేట జంక్షన్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను చివరి దశలో పూర్తిచేయాలని సూచనలు ఇచ్చారు. జంక్షన్‌లో లైటింగ్ ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. కోటిరెడ్డి జంక్షన్ వద్ద కమిషనర్ సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలిసి ఫ్రెంచ్ ఏర్పాటుపై చర్చించి, స్ట్రామ్ వాటర్ డ్రైన్‌లో వర్షపు నీరు కలిసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో అడుగుపెట్టి 50 ఏళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలోని ఎన్టీఆర్ కూడలిలో శనివారం బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి బాలకృష్ణ సినీ స్వరోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, పీరయ్య, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, గుంరప్ప, జయ కుమార్, అమీర్, ఖాసీం, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

అపుస్మా కడప నగర నూతన కార్యవర్గం ఎన్నిక



మైథిలి, డాక్టర్ పద్మనాభరెడ్డి

ప్రజాశక్తి - కడప : నగరంలోని బాల వికాస్ స్కూల్‌లో కడప నగరం అపుస్మా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా సాయి విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ మైథిలి, ప్రధాన కార్యదర్శిగా ఫోకస్ హై స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె. పద్మనాభ రెడ్డి, కోశాధికారిగా మధుసూధన హై స్కూల్ కరస్పాండెంట్ కే. వంశీ ప్రసాద్ తో పాటు మరో 14 మంది సభ్యులతో అపుస్మా కడప నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు గంగయ్య, గౌరవ అధ్యక్షులు ఎలియాస్ రెడ్డి, సహాయ కార్యదర్శి సి.వి. సుబ్బయ్య, శివశంకర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని పాలెం పల్లె గ్రామంలో పంట పొలాలను వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. పంట నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 60 రోజులపాటు వర్షాలు లేని కారణంగా పంట పొలాలు వాడు ముఖం పట్టాయని చెప్పారు. మినుము, వేరుశనగ, పత్తి పంటలు ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా కొద్దిగా ఉపశమనం చేకూరుతాయని తెలిపారు. నీటిపారుదల కింద సాగు అయిన పత్తి పంటలో వర్షాల వల్ల కొంతమేర తెగుళ్ల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.

తెంపరితనం!

ప్రజా'దృష్టి'


కడప కార్పొరేషన్ పరిధిలో 'చెత్త' రాజకీయం రోత పుట్టిస్తోంది. రాష్ట్రంలో అధికార టిడిపి, కడప కార్పొరేషన్ పాలిత వైసిపి మధ్య చెత్త తొలగింపు వ్యవహారం రాజకీయమైంది. ప్రభుత్వం 30 చెత్త తరలింపు వాహనాలను కుదించడమే చెత్త రాజకీయ దుమారానికి కారణం కావడం గమనార్హం. చెత్త తొలగింపు వాహనాలను రద్దు చేయడాన్ని నిరోధించాలి. లేదా చెత్త తొలగింపు వాహనాలకు పన్ను చెల్లింపు మార్గాన్ని అన్వేషించాలి. ఇటువంటి రెండు మార్గాలను అన్వేషించకుండా కార్పొరేషన్ పాలకవర్గంపై బెదిరింపు తరహా విమర్శలు చేయడం సిగ్గుచేటు. కడప టిడిపి ఎమ్మెల్యే కార్పొరేషన్ పాలకవర్గంపై విమర్శలు చేశారు. చెత్తను తొలగించకపోతే మేయర్ ఇంట్లో చెత్త వేయాలని విమర్శలు చేయడం వరకు పర్వాలేదు. చెత్తను తీసుకెళ్లి మేయర్ ఇంటి ముంగిట చెత్త వేయడం చౌకబారుతనానికి నిదర్శనమనే చెప్పాలి. వైసిపి జిల్లా నాయకత్వం స్పందించి మేయర్ ఇంట్లో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కలిస్తే బెదిరింపు రాజకీయం చేయడం జుగుప్సను కలిగిస్తోంది. ప్రభుత్వం చేతిలో పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం కార్పొరేషన్ పాలకవర్గాన్ని రద్దు చేసే అవకాశం ఉందనే తరహాలో బెదిరింపులకు దిగడం దారుణం. తెంపరితనం ప్రజాస్వామ్యంలో మనలేదనే సంగతిని గ్రహించాలి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముంగిట టిడిపి అధికారంలోకి వస్తే చెత్త పన్ను వసూలు చేయబోమని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటువంటి హామీకి కట్టుబడి రాజకీయం చేయాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను ప్రత్యర్థి పార్టీకి చెందిన పాలకవర్గం అమలు చేయాలని కోరడం దివాళాకోరుతనానికి నిదర్శనం కాదా అని ఆలోచించాలి. టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజులు ముగియకముందే ఇటువంటి తరహా రాజకీయం చేస్తే మిగిలిన నాలుగున్నరేళ్ల కడప అసెంబ్లీలో ఎటువంటి రాజకీయం నడవనుందో ఇట్టే తెలిసిపోతోందనే విశ్లేషణలు వినిపిస్తుండడం గమనార్హం. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలి, ఎన్నికల అనంతరం సమాజ అభివృద్ధి, పేదల సంక్షేమం, పాలనలో పారదర్శ కత, జవాబుదారీ తనం ఉండేలా పాలన సాగేలా చూడాలి. కార్పొరేషన్ పాలనలో ఎక్కడైనా తప్పులు దొర్లితే నిలదీయాలి, సరిచేయాలి, కానీ ఇటువంటి తరహా చెత్త రాజకీయాన్ని ప్రజలు హర్షించరనే సంగతి గ్రహించి మసలుకోవాలి. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య, పారిశుధ్యం, లోతట్టు ప్రాంతాల ముంపు సమస్య, బుగ్గవంక సుందరీకరణ, సర్కిళ్ల అభివృద్ధి వంటి ఎన్నో సమస్యల పరిష్కా రానికి ఆలోచనలు సాగించాలి. ఇటువంటి ప్రజల సమస్యల పరిష్కారం చేయకుండా రాష్ట్రంలో అధికార పార్టీ కుదించిన 30 చెత్త వాహనాలకు పన్ను చెల్లింపు చేయడం ఎలా, కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నిధుల్లో సర్దుబాటు చేయడానికి ఒప్పించాలి, అది కుదరకపోతే ప్రభుత్వం నుంచి అదనపు నిధులు తెప్పించి, అందులో నుంచి ఖర్చు చేయడమా అనే ఆలోచనలు సాగించాలి. వైసిపి హయాంలో సాగిన కడప నగర అభివృద్ధిని మరిపించేలా అభివృద్ధి, సంక్షేమాన్ని ఎలా చేయాలా అనే ఆలోచనలు చేయాలి. ఇటువంటి ఆలోచనలు చేయకుండా, కేవలం ప్రత్యర్థులను బెదిరించడం ఎలా అనే తరహా రాజకీయం వికటించే ప్రమాదం పొంచి ఉందనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

శ్రీనారాయణీ కేర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు

-చైర్మన్ డాక్టర్ వి.భార్గవ రామ్, డైరెక్టర్ డాక్టర్ కె.చరిష్మా వెల్లడి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ భార్గవరామ్, డాక్టర్ చరిష్మా


శ్రీ నారాయణీ కేర్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 5 వరకు ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ ఉం టుందని చైర్మన్, చర్మం, వెంట్రుకల, సుఖ వ్యాధుల నిపుణులు, కాస్మో టాలజిస్ట్ డాక్టర్ వి.భార్గవ రామ్, డైరెక్టర్, గర్భిణి, స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ కె.చరిష్మా తెలిపారు. శనివారం నగరంలోని సిఎస్ఐ సెంట్రల్ చర్చి ఎదురుగా ఉన్న శ్రీ నారాయణీ కేర్ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆదరించిన ఉమ్మడి కడప జిల్లా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 5 రోజుల ఉచిత ఓపి వైద్య సేవలతో పాటు సెప్టెంబర్ నెలలో అన్ని చికిత్సలు, ఆపరేషన్ల పై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, స్త్రీ వ్యాధులు, మహిళలకు స్కానింగ్, సంతాన సాఫల్య చికిత్సలు, సర్జరీలు సెప్టెంబర్ లో 50 శాతం తగ్గింపుతో చేస్తామన్నారు. చర్మవ్యాధుల చికిత్సలు, కాస్మెటిక్ లేజర్ ట్రీట్మెంట్‌లు సెప్టెంబర్ నెలలో 50 శాతం రాయితీతో చేస్తామన్నారు. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది, ల్యాబ్, ఫార్మసీ తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున జిల్లా ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.పేర్ల నమోదు కొరకు సెల్ నంబర్ 9392431356 ను సంప్రదించాలని కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - కడప : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఉచిత అవగాహన, వైద్య శిబిరం కార్యక్రమాన్ని శనివారం కడప జిల్లాకు ఆవరణంలో నిర్వహించారు. ఆయుర్వేద డాక్టర్లచే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ సిబ్బందికి, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి శ్రీదేవి ప్రారంభించారు.

ఎస్ఇ సేవలు మరువలేనివి : కమిషనర్

ప్రజాశక్తి -కడప అర్బన్ : కడప నగరపాలక సంస్థలో ఎస్ఇ గా పనిచేసిన కె.రత్నాల రాజు సేవలు మరువలేనివని కమిషనర్ వై.ఓ. నందన్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న రత్నారాజు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సర్కిళ్ల అభివృద్ధికి ఎస్ఇ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. విరమణకు దగ్గరగా ఉన్నా విధులు మాత్రం యువతకు పోటీపడేలా చేసేవారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదని తెలిపారు. ఆయన విలువలైన సలహాలు సూచనలు పాటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిఇ ధనలక్ష్మి, ఇంజినీరింగ్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఇ రత్నాల రాజు దంపతులను సన్మానిస్తున్న కమిషనర్ నందన్

నేడు ఇడుపులపాయకు షర్మిల రాక

ప్రజాశక్తి - వేంపల్లె



జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి పిసిసి చీఫ్ షర్మిలా వచ్చేయనున్నారు. ఈనెల 3 వరకు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇడుపులపాయకు చేరు కుంటారు. రాత్రి వ్యవసాయ క్షేత్రంలోని గెస్ట్ హౌస్ బస చేస్తారు. 2న ఉదయం 8 గంటలకు వైఎస్ఆర్ సమాధి వద్దకు వెళ్లి వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించనున్నారు. అనంతరం కడపకు బయలు దేరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ నేతలను, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతంపై చర్చిస్తారు. 3న కడపలో ఉన్న కలెక్టర్‌ను కలిసి ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తారు. 12.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా సమస్యలను తెలుసు కుంటారు. అనంతరం తిరిగి ఇడుపులపాయకు వెళ్తారు. 4న 11.40 గంటలకు కడప ఎయిర్ పోర్ట్‌కు వెళ్లి అక్కడ నుండి విజయవాడకు బయలుదేరుతారు.

యువతరంపై ఆరుద్ర ముద్ర

ప్రజాశక్తి - కడప అర్బన్ : అభ్యుదయకవిగా శ్రీశ్రీ తరువాత యువతరం పై ఎక్కువ ముద్ర పడిన కవి ఆరుద్రేనని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం ఆరుద్ర శతజయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కవిగా, పండితునిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా, ఆరుద్ర ప్రసిద్ధులని అన్నారు. ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆ ఆరుద్ర రాసిన 14 సంపుటాల సమగ్ర ఆంధ్ర సాహిత్యం ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ట అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, సభ్యులు పొదిలి నాగరాజు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరరాచారి , రచయిత కల్లూరు బాల ఎల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు జ్ఞాన దేవి,బాల ఓబయ్య, శివ, మధు పాల్గొన్నారు.

అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు వాయిదా

ప్రజాశక్తి - కడప : కడప నగరం వై.ఎస్. రాజారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించాల్సిన అండర్-14 కడప జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం తగ్గిన తర్వాత మళ్లీ ఎప్పుడు ఎంపికలు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప : ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని పర్మనెంట్‌లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కడప నాగరాజుపేటలో ఉన్న ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై కళాశాల హెడ్ పి.ఎం.ఆర్. జయంతి, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను వెంటనే క్లియర్ చేయాలని పేర్కొన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్‌ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందిస్తారని చెప్పారు. 'పర్మనెంట్ లోక్ అదాలత్" అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కలిగివున్న వారందరికి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారన్నారు.. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో లేదా సెల్ 8639684279, 9963731698లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



పింఛనుదారులకు పండ్లు, బ్రెడ్ అందిస్తున్న ప్రేమ్‌సాగర్ రెడ్డి

బ్రెడ్డు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక 3వ వార్డు క్రిస్టియన్ లైన్‌లో టిడిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది చేపట్టారు. లబ్ధిదారులకు ఇంటి దగ్గరికే పెన్షన్ అందించడం ప్రభుత్వ ధ్యేయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లకు తూగుట్ల ప్రేమ్‌సాగర్‌రెడ్డి పండ్లు, బ్రెడ్ అందజేశారు. సచి వాలయ సిబ్బంది శుబాన్ బీ, శ్యామ్, రాజ్‌కుమార్, యోబు, శిఖామణి, చిన్న పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల టిడిపి సీనియర్ నాయకులు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీల భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. ఒక్కరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేసి లబ్ధిదారుల్లో ప్రభుత్వం ఆనందంతో నింపిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు.



ఖాజీపేట : పింఛన్ అందజేస్తున్న టిడిపి నాయకులు

హామీలను నెరవేరుస్తున్న ఘనత చంద్రబాబుదే

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి కూటమి అధికారంలోకి రాగానే ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకే దక్కిందని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఇట్టేం శ్రీరాములు యాదవ్ అన్నారు. మండలం పరిధిలోని మిడుతూరు గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో చెప్పిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చి కొన్ని నెలలకే హామీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తున్నా. ప్రతిపక్ష పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై చెడు ప్రచారం చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజారెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ యేసు పాదం, సామెల్, నరసింహ, ఇట్టెం అంకాల్ యాదవ్ పాల్గొన్నారు.

57 పింఛన్లు తొలగింపు

ప్రజాశక్తి - ముద్దనూరు

సామాజిక పింఛన్లకు అనర్హులైన కొందరు లబ్ధిదారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పింఛన్లు పొందుతున్న 57 మందిని ప్రభుత్వం తొలగించినట్లు ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి వద్ధాప్య, వితంతు, వికలత్వ తదితర పింఛన్లు 5,318 ఉన్నాయన్నారు. ఇందులో కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పింఛన్లు పొందుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ఉన్నతాధికారులు ఫిర్యాదులను పరిశీలించి పింఛన్ తీసుకుంటున్న 168 మందికి రీ వెరిఫికేషన్‌కు వెళ్లాలని నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. రీ వెరిఫికేషన్‌లో 57 మంది లబ్ధిదారుల అనర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరికి సెప్టెంబర్ పింఛన్లు ప్రభుత్వం తొలగించినట్లు చెప్పారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి పునాది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నాయీ బ్రహ్మణుల అభివృద్ధికి పునాది లాంటిదని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం దేవాలయంలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణ చేతి వృత్తి దారులకు కనీస వేతనం రూ.25,000 పెంచడం, దేవాలయ ఆలయం కమిటీ బోర్డులో ఒక కమిటీ సభ్యుడిగా వారిని నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయీ బ్రాహ్మణ కడప పార్లమెంటు అధ్యక్షులు గజ్జల గోవిందు, జమ్మలమడుగు నాయీ బ్రాహ్మణ కమిటీ సభ్యులు, దేవగుడి సుబ్బరాయుడు, నరసయ్య, కలవటాల చక్రపాణి, రెడ్డి బిర్రు సంతోష్ భాను సుభహాన్, ఈశ్వర్ నాయక్, పార్థసారథి, మధు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కామానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చౌడూరు సచివాలయం కాకిరేణిపల్లెలో వైద్యాధికారి జి.హనీఫ్ బాబా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు పొందవచ్చన్నారు. చిన్నచిన్న జబ్బులకు చికిత్స, సల హాలు పొందవచ్చని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ గౌతమి, ఎఎన్ఎం వేదవతి, డిఈఓ దేవ రాజ్, పైలట్ రామానాథ్, ఆశాలు వెంకట సుబ్బమ్మ, పద్మావతి, సంజమ్మ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

శ్రీరాములపేట ప్రాథమిక పాఠశాలలో యర్రగుంట్ల జర్నలిస్ట్ యూనియన్, మల్లు ఫౌండేషన్, మన ఊరి కోసం టీం వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య పరీక్షలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ నవీద్ అహ్మద్, జనరల్ మెడిసిన్ సంబంధమైన డాక్టర్ త్రిసూల్‌రెడ్డి, గైనాకాలజి డాక్టర్ భావన, లతా పాలీనర్సింగ్ హెూమ్ డాక్టర్ హరీష్‌రెడ్డి, కీర్తిరెడ్డి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘాటు తగ్గిన పచ్చిమిర్చి

గతంలో కాసుల వర్షం.. ప్రస్తుతం నష్టాల్లో రైతులు - పంటను దున్నేస్తున్న వైనం



పచ్చి మిర్చిని మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొద్దిరోజుల వరకు కాసుల వర్షం కురిపించిన పచ్చిమిర్చి పంట.. ప్రస్తుతం ధరలు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. గత నాలుగు నెలల నుంచి పచ్చి మిర్చికి మంచి ధర లభించడంతో వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. ఆగస్టు మొదటి వారంలో 58 కిలోల బస్తా రూ.1,500 ఉండగా.. ప్రస్తుతం రూ.350కు పడిపోయింది. పులివెందుల నియోజకవర్గంలోని ఇప్పట్ల, లింగాల, కర్ణపాపయపల్లి, వెలిదండ్ల, కోమన్నూతల, మురారిచింతల, అంబకపల్లె, నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, అంకాళమ్మ గూడూరు, బిదినంచెర్ల, తొండూరు, వేములలో వెయ్యి ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. ధరలు పూర్తిగా పతనమవడంతో రైతులు డీలా పడిపోయారు. ఎకరా పచ్చిమిర్చి సాగుకు సేద్యం, మిరప నారు, కలుపు తీత, మందుల పిచికారీ, సేంద్రియ ఎరు వులు, బిందు సేద్యం, పైపులకు రూ.1.50 లక్షలు ఖర్చవుతుంది. ఎకరా సాగుకు 100 నుంచి 130 బస్తాల దిగుబడి వస్తుంది. బస్తా రూ.1500 ధర పలికితే రైతులకు లాభం. కానీ ప్రస్తుతం వ్యాపారులు రైతుల పొలాల వద్ద కిలో రూ.6కు కొనుగోలు చేస్తూ వినియోగదారులకు రూ.30కి విక్రయిస్తున్నారు. దీంతో రైతులకు నష్టాలు మిగిల్చి వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. జిలా వ్యాప్తంగా దిగుబడులు పెరగడంతో ధరలు తగ్గాయి. బస్తా మిర్చి కోస్తే కూలీ రూ.300 ఇస్తున్నారు. 2 నుంచి 3 ఎకరాల్లో పంట సాగుచేసిన రైతులు 40 మంది కూలీలతో మిర్చిపంట కోయిస్తున్నారు. 40 బస్తాలను మార్కెట్లోకి తరలిస్తే తగ్గిన ధరలతో రైతు చేతి నుంచి రూ.2 వేల వరకు వాహనాల బాడుగ, కూలీల ఖర్చు భరించాల్సి వస్తోందని పంటను దున్నేస్తున్నారు.

పంటను దున్నేశాం..

ఆగస్టు రెండో వారం నుంచి మిర్చి ధరలు పూర్తిగా తగ్గాయి. వ్యాపారులు 58 కిలో బస్తా రూ.350కు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో కిలో రూ.30కి విక్రయిస్తున్నారు. లాభం లేదని సాగులో ఉన్న రెండెకరాల పంటను దున్నేశాం.

- శ్యామసుదర్ రెడ్డి, రైతు, కర్ణపాపయపల్లి, లింగాల

ధర తగ్గిన మాట వాస్తవమే..

గత ఏడాది కన్నా దిగుబడులు పెరిగి మిర్చి పంట మార్కెట్లోకి అధికంగా రావడంతో ధరలు అనూహ్యంగా తగ్గాయి. గతేడాది, ఈ ఏడాది ప్రారంభంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు రావడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. ధరలు తగ్గడానికి ఇది ప్రధాన కారణం.

- రాఘవేంద్రారెడ్డి, ఉద్యాన అధికారి, పులివెందుల

'నిజాయితీ వ్యవస్థను నిర్మించాలనుకుంటున్నా'

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదని, నిజాయితీగల వ్యవస్థను నిర్మించాలనుకుంటున్నానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేస్తున్న లేనిపోని అభియోగాలను ఖండిస్తున్నానన్నారు. తన రాజకీయ చరిత్రలో ఎన్నడూ నేను అవినీతికి పాల్పడలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీ హయాం లోనే గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించారని ఆరోంచారు. ఎన్‌విఆర్‌ఆర్ అనే అక్షరాలు ఏ వాహనం మీద ఉంటే ఆ వాహనం నాదైపోతుందా అని ప్రశ్నించారు. తన పేరుతో అనేక గ్రామాలలో అనేక మంది పేర్లు ఉంటాయని అంతమాత్రాన అవి నా వాహనాలే అని ఎలా చెబుతారన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అసాంఘిక కార్యకలాపాలను వ్యతిరేకిస్తారన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గుట్కా, అక్రమ ఇసుక రవాణా వంటి చట్ట వ్యతిరేకమైన పనులు ఎవరు చేసి నా కచ్చితంగా వారిని చట్టపరంగా శిక్షించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇవి సుధాకర్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి, కౌన్సిలర్ కమల్ బాషా, ఘంటసాల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

చివరి శనివారం గండికి పోటెత్తిన భక్తులు

వేంపల్లి నుంచి దారి పొడవునా అన్నదానం.. దర్శనం కోసం నాలుగు గంటలు



గండిలో బారులుతీరిన భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి మూల విరాట్

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో శ్రావణ మాస చివరి శనివారం వర్షం సైతం లెక్కచేయకుండా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకుడు రాజా స్వామి అలంకరించారు. దేవస్థాన సహాయ అసిస్టెంట్ కమిషనర్ (ఇన్‌ఛార్జి) జె.వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలుస్టేషన్ల నుండి దాదాపు 270 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా వేంపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద, ఆంజనేయస్వామి దర్శనం కోసం నాలుగు గంటలపైన సమయం పట్టినట్లు భక్తులు పేర్కొంటున్నారు. కాలినడక భక్తులకు సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ మేల్ అసిస్టెంట్ వెంగయ్య, రామచంద్ర, ఎఎన్ఎంలు లక్ష్మీదేవి, నవనీత, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, డిఎస్‌పి మురళి నాయక్, సిఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

దారి పొడవునా భక్తులకు అన్నదానం

వేంపల్లె : శ్రావణ మాసం సందర్భంగా గండికి కాలినడకన వెళ్లే భక్తులకు దారి పొడవునా దాతలు అన్నదానం చేపట్టారు. రాయచోటి రోడ్డులో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. గండి రోడ్డులోని బృందావనం కాలనీ వద్ద టిడిపి యూత్ నాయకులు యాసిన్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, వేమా కుమార్, డక్కా రమేష్, మారుతి, మడక శ్రీను, పుల్లారెడ్డి, వేణుగోపాల్, గంగాధర్, నాగభూషణం, మహబూబ్ షరీఫ్, అల్లాబకష్, భాస్కర్, యుగంధర్ పాల్గొన్నారు.



గండి క్షేత్రంలో అలరించిన ముద్ర అకాడమి చిన్నారుల నృత్య ప్రదర్శన



రోడ్డుపై అసౌకర్యంగా ఉన్న చెత్త

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న చెత్తను వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు కోరారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో రోడ్డుపైనే చెత్త ఎక్కువగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రహదారి వెంట ప్రతి రోజూ కళాశాలకు, బాలికల పాఠశాలకు విద్యార్థులు వెళుతుంటారని తెలిపారు. వర్షపు నీరు నిల్వ, రోడ్డు పక్కనే చెత్త ఉడడంతో ఆ రహదారిలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థులు చెత్తలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వమైనా విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యుఇసిడబ్ల్యుయు జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్యాలయం వద్ద ఈనెల 5న చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని శనివారం శనివారం స్థానిక 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గోడ పత్రికలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు ఇచ్చిన మాట తప్పడంతో ఇంటికి వెళ్లిందని చెప్పారు. ప్రతి విద్యుత్ కార్మికుడు తిరుపతిలో ఎస్పీడిసిఎల్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో యుఇసిడబ్ల్యుయు పులివెందుల డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సబ్ డివిజన్ నాయకులు చంద్రశేఖరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీను, రాధాకృష్ణ, మనోహర్, నాగార్జున, వంశీ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక 14వ రెవెన్యూ వార్డులోని దస్తగిరిపేటలో చౌకదుకాణం డీలర్ పబ్బతి జ్యోత్స్న తన చౌకదుకాణం ద్వారా వచ్చే కమీషన్‌ను అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళం ప్రకటించారు. ఆ మేరకు ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని శనివారం అధికారులను కోరారు. ఎలాంటి ప్రతిఫలం, పారితోషికం ఆశించకుండా సేవాభావంతో స్వచ్ఛందంగా రేషన్‌షాపు నిర్వహిస్తానని తెలిపారు. రాజధాని లేకుండా మన రాష్ట్రం ఉండకూడదనే తలంపుతో రాజధాని నిర్మాణంలో తన వంతు సహకారం అందించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పౌర సరఫరాశాఖామంత్రి నాదేండ్ల మనోహర్, విద్యాశాఖా మంత్రి లోకేష్, అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి తెలిపానని జ్యోత్స్న తెలిపారు.

ముందుగా పింఛను ఇవ్వడం సంతోషకరం

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు

అవ్వాతాతలకు ఒక రోజు ముందుగనే పెన్షన్ ఇవ్వడం సంతోషకరమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి కుతుబుద్దీన్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ పెన్షనర్లకు ఒక రోజు పెన్షన్ ముందు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఆ ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి మురళి నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చట్ట వ్యతిరేక చర్యలు నివారించుటలో భాగంగా ముందు జాగ్రత్తగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలుకు అనుమతులు తీసుకోవాలన్నారు.



మొక్క నాటుతున్న సిడిపిఒ, సర్పంచ్ మునేష్

మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు అవసరమని, వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్ పేర్కొన్నారు. అమ్మ కోసం ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా శనివారం కుమ్మరాంపల్లె అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ సునీత, కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు ఎక్కువగా ఉండడం వల్ల వర్షాలు కూడా సకాలంలో కురిసే అవకాశం ఉందని చెప్పారు. పూర్వ కాలంలో పల్లెల్లో ఎక్కువగా చెట్లు ఉండేవని, ప్రస్తుతం చెట్లు లేక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా వాతావరణ కాలుష్యం పెరిగి పోయిందని చెప్పారు. చెట్లు ఉండడంతో ఆహ్లాదకరమైన పరిస్థితులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఇడుపాయల-2 సచివాలయం పంచాయతీ సెక్రటరి శివకుమార్, మహిళా పోలీసు లలిత, గర్భిణులు బాలింతలు, అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, అంగన్వాడీ సహాయకురాలు శారద, చిన్నారులు పాల్గొన్నారు.

వినాయక మండపాల అనుమతికి ప్రత్యేక వెబ్‌సైట్

ప్రజాశక్తి - ముద్దనూరు

వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలను జరుపుకునేందుకు ఏర్పాటు చేసుకునే మండపాల అనుమతి కోసం నిర్వాహకులు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సిఐ దస్తగిరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో భాగంగా మండపాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతి కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసిందన్నారు. హెచ్‌టిపిపి://గణేస్‌ఉత్సవ్.నెట్ ద్వారా మండపాల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు సింగిల్ విండో విధానంలో పొందవచ్చన్నారు. మండపాల నిర్వాహకులు, ప్రజలు, భక్తులు ఈ వెబ్‌సైట్ వినియోగించుకోవాలని సిఐ కోరారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

సింహాద్రిపురం : వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం కడప జిల్లా అధ్యక్షులు సాకే ఆదినారాయణ కోరారు. శనివారం ఆయన సింహాద్రిపురంలో విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్‌టి రిజర్వేషన్ అంశాన్ని సాధ్యమైనంత త్వరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్ల నుంచి ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల నాయకులు హామీలు ఇవ్వడం తప్ప, ఆచరణలో పెట్టడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా రాముడు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా టి.రాముడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రమణారెడ్డి విజయవాడ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కమలాపురం మున్సిపల్ కమిషనర్ రాముడు పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని ఏకోపల్లె గ్రామం వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన సందలమ్మ గారి సిద్ధిక్ (25) సొంత పనుల మీద ప్రొద్దుటూరు వెళ్లి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏకోపల్లె గ్రామం వద్ద ముందు వెళుతున్న బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. బైక్‌లో వెళుతున్న సిద్ధిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక కడప రోడ్డులో ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో జయశంకర్‌రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్‌రెడ్డి భారతీయ సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కడప రోడ్డులోని కిరణ్ బార్ అండ్ రెస్టారెంట్ సమీపాన వెనకవైపు నుంచి ఆర్‌టిసి బస్సు అతివేగంగా ఢీకొంది. వెంటనే అక్కడే ఉన్న స్థానికులు 108 వాహనంలో జయశంకర్‌రెడ్డిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారులపై రాళ్లదాడి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని భూమయపల్లె వద్ద ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వారిపై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాళ్లతో దాడి చేశారు. వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని కొందరు పోలీసులు దృష్టికి తీసుకెళ్లడంతో సంఘటన ప్రాంతానికి వారు చేరుకొని విచారణ చేపట్టారు. గాయపడిన వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు విచారిస్తున్నారు.

గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం

- 9 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులకు గోవా మద్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్న ఐచర్ వాహనాన్ని పులివెందుల అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు రూ.కోటి విలువచేసే 13వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి ఆధ్వర్యంలో పులివెందుల అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్ బాబు తన సిబ్బందితో ముదునూరు రోడ్డు వద్ద ఉన్న రాయలాపురం తుమ్మలపల్లి గ్రామ సరిహద్దుల్లో వాహనాల తనిఖీ చేస్తుండగా.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అనుమానంతో ఐచర్‌ను తనిఖీ చేయగా అనుమతులు లేకుండా ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వివరించారు. చెవికల జనార్ధన్‌రెడ్డి, గంగవరం నీలకంఠారెడ్డి, పెద్ద సోమప్పగారి చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ దిద్దికుంట చంద్రశేఖరెడ్డి, బాలకృష్ణ, భరత్, సాల్మన్ రాజా, నాగరాజు, భాస్కర్‌రెడ్డి, మగేష్ వాహన డ్రైవర్ మద్యాన్ని గోవా నుంచి పులివెందులకు అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. వీరిలో ఆరు మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఈ మద్యం గోవా, మహారాష్ట్ర ప్రాంతాల్లో తయారై ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ జీవన్ గంగానాథ్ బాబు, ఎస్ఐ నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి మురళినాయక్